తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి
గురువారం
19 మార్చి 2026
పేజీలు : 8
Follow :

# ఖమ్మం ఖిల్లాలో ముస్లిం లీగ్ పార్టీ ప్రవేశం

## ముస్లిం ఓటు బ్యాంక్‌పై రాజకీయ చర్చలు
## కొత్త సమీకరణాల సూచనలు




**ఖమ్మం, మార్చి 18, (జనంసాక్షి) :** ఖమ్మం రాజకీయాల్లో మరో జాతీయ పార్టీ అడుగుపెట్టింది. దేశవ్యాప్తంగా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ కార్యకలాపాలు ఖమ్మం జిల్లాలో ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం దేశంలో అనేక ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తులో కొనసాగుతున్న ఈ పార్టీ, కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాల్లో భాగస్వామిగా కూడా ఉంది. ఈ నేపథ్యంలో గతంలో తెలుగుదేశం పార్టీ, భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగాల్లో జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన షేక్ బాజీ బాబా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన ప్రస్తుతం జిల్లాలో పార్టీ విస్తరణపై దృష్టి సారించి వివిధ డివిజన్లలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు.

**ముస్లిం వర్గంలో అసంతృప్తి?**

ఖమ్మం జిల్లాలో ముస్లిం సామాజిక వర్గంలో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు దాటినా, ముస్లింలకు ప్రాధాన్యమైన ప్రోటోకాల్ పదవులు పెద్దగా దక్కలేదనే అభిప్రాయం వినిపిస్తోంది. ఖమ్మం నియోజకవర్గంలో గానీ, జిల్లా వ్యాప్తంగా గానీ ముస్లిం వర్గానికి గౌరవప్రదమైన పదవులు ఇవ్వలేదని కొంతమంది నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఖమ్మం నగరంలోని లేక్వ్యూ క్లబ్ సమీపంలో షాదీఖానా నిర్మాణానికి స్థలం కేటాయించి నిధులు కూడా తీసుకువచ్చిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ షాదీఖానా అంశంలో స్పష్టత లేకుండా ఉందని స్థానిక వర్గాలు పేర్కొంటున్నాయి. షాదీఖానాను వేరే ప్రాంతానికి తరలించే ఆలోచన జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**కార్పొరేషన్ ఎన్నికలపై ప్రభావం?**

రాబోయే కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో ముస్లిం ఓటు బ్యాంక్ కీలక పాత్ర పోషించే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో పోటీ చేసేందుకు సిద్ధమవుతోందని సమాచారం. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో పార్టీ కమిటీలను ఏర్పాటు చేస్తూ బలపడేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇతర పార్టీల్లో టిక్కెట్ దక్కని నాయకులు ముస్లిం లీగ్ వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఖమ్మం రాజకీయాల్లో కొత్త సమీకరణాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. ఖమ్మం నియోజకవర్గంలో మంత్రి తుమ్మల కుటుంబం రాజకీయంగా చురుకుగా వ్యవహరిస్తుండగా, మరోవైపు ముస్లిం సామాజిక వర్గం తమ భవిష్యత్ రాజకీయ దిశపై ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ ఖమ్మం రాజకీయాలు మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏదేమైనా, రాబోయే ఎన్నికలు ఖమ్మం రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది పలికే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

## రాష్ట్ర ప్రజలకు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు
### మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి




**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** ఉగాది తెలుగు సంవత్సర ఆరంభాన్ని సూచించే ముఖ్యమైన పండుగ అని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇది కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలతో ముందుకు సాగాల్సిన సమయమని తెలిపారు. రైతాంగానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ సంవత్సరం సమృద్ధిగా పంటలు పండాలని, రైతులు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని తెలిపారు.రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.అన్ని వర్గాల సంక్షేమం,అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు.

## ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు
### జిల్లా ఎస్పీ నరసింహ



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** ఉగాది పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు పోలీస్ శాఖ తరపున ఎస్పీ నరసింహ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది, రంజాన్ పండుగ సందర్భంగా ప్రజలందరూ సోదరభావం తో కలిసి మెలిసి ఉత్సాహం గా జరుపుకోవాలని కోరారు. ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా ఎవరు కూడా ప్రవర్తించకూడదని అన్నారు. ఒకరికొకరు గౌరవించుకుంటూ పండుగలు జరుపుకోవాలని అన్నారు.

## తుమ్మలపల్లి శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఆదాయం రూ. 18,08,120/-
### లెక్కలపై గ్రామస్తుల అనుమానాలు..!




2లో

## ప్రజలందరికీ, పరాభవ నామ సంవత్సర (ఉగాది )శుభాకాంక్షలు
### హుజూర్ నగర్ మాజీ జెడ్పిటిసి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు డా.కొప్పుల సైదిరెడ్డి



**హుజూర్ నగర్, (జనంసాక్షి):** కొత్త ఆశలతో, కొత్త సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న సంధర్భంగా ప్రజలందరికీ మంచి జరగాలని ఆశిస్తూ..ఈ పరాభవ నామ సంవత్సరంలో హుజూర్ నగర్ నియోజకవర్గ ప్రజలందరికీ శుభాలు కలగాలని హుజూర్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ జెడ్పిటిసి, డా.కొప్పుల సైదిరెడ్డి ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసారి కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, పంటలు బాగా పండి రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని అభిలషించారు. తెలంగాణ రాష్ట్రంలో గత 10 ఏండ్లలో మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో అద్భుత పాలన జరిగిందని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు పండుగలా అమలు అయ్యాయని అన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా ఈ ఉగాదిని నియోజకవర్గ ప్రజలు అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని అన్నారు.

## శ్రీ పరాభవ నామ ఉగాది శుభాకాంక్షలు
### హాలియా మునిసిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి



**హాలియా, మార్చి 18 జనం సాక్షి:** తెలుగు సంవత్సరాది అయిన శ్రీ పరాభవ నామ ఉగాది పండుగ సందర్భంగా హాలియా మునిసిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది మన తెలుగు వారి వారసత్వాన్ని ప్రతిబింబించే మహత్తర పండుగ అని పేర్కొన్నారు. పండుగలు మన ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ సమాజాన్ని సజీవంగా నిలబెట్టే శక్తిగా నిలుస్తాయని తెలిపారు.ఉగాది పండుగ కొత్త ఆరంభాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి ఇంటా ఆనందం, ఐక్యత, సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. వ్యవసాయ సంవత్సరానికి ఆరంభంగా భావించే ఈ పండుగ రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని,ప్రతి ఒక్కరూ ఉగాది పండుగను ఆనందంగా, సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని, కొత్త సంవత్సరంలో మంచి ఆలోచనలు, మంచి కార్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

### తుమ్మలపల్లి శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల

# ఆదాయం రూ. 18,08,120/-

**చండూరు, మార్చి 18 (జనంసాక్షి)**
నల్గొండ జిల్లా చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చిన ఆదాయ వివరాలను అధికారులు వెల్లడించారు. అయితే, ఈ ఆదాయ వ్యయాల లెక్కలపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ, పారదర్శకత కోరుతున్నారు.ఆలయ కార్యనిర్వహణ అధికారి (ఈ వో) అంబటి నాగిరెడ్డి, చైర్మన్ గున్ రెడ్డి రమ్య రామలింగా రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, బ్రహ్మోత్సవాల ద్వారా మొత్తం రూ. 18,08,120 ఆదాయం లభించింది. దీనికి సంబంధించిన విడి విభాగాలు ఇలా ఉన్నాయి.కొబ్బరికాయల వేలం: రూ. 4,50,000/- లడ్డు, పులిహోర ప్రసాదాలు: రూ. 3,60,000/- కొబ్బరి చిప్పల సేకరణ: రూ. 65,000/- ఫోటోల ద్వారా: రూ. 18,500/- పూజా టికెట్ల ద్వారా: రూ. 2,16,198/- హుండీ ఆదాయం: రూ. 2,81,248/- స్వామివారి కళ్యాణం కట్నాలు: రూ. 2,10,447/- రథోత్సవం కట్నాలు: రూ. 2,06,727/-

**అధికారుల వివరణ గ్రామస్తుల ఆందోళన:**
ఆదాయం ఘనంగానే వచ్చినప్పటికీ, ఖర్చుల విషయంలో అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు.

**వినిపిస్తున్న బహిరంగ ఆరోపణలు:**
ఆదాయం ఎంత వచ్చిందో చెప్పిన అధికారులు, దేనికి ఎంత ఖర్చు చేశారో పైసా లెక్కలతో సహా బహిర్గతం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలపై అనుమానాలు ఉత్సవాల ఏర్పాట్ల పేరుతో అధిక మొత్తంలో చెల్లింపులు చూపి, కమిషన్లు పొందారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కానుకల రూపంలో వచ్చిన బంగారం, వెండి వస్తువుల వివరాలు మరియు వాటి భద్రతపై సరైన సమాధానం రావడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రజాధనం మరియు భక్తుల కానుకలకు సంబంధించిన లెక్కల్లో పారదర్శకత లేకపోవడంపై గ్రామంలో అసహనం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, పూర్తిస్థాయి విచారణ జరిపి, ఖర్చుల వివరాలను ప్రజల ముందు ఉంచాలని తుమ్మలపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

### మునుగోడు సాగు త్రాగునీటి సమస్యలు తీర్చాలని

# ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినతులు

**చౌటుప్పల్ మార్చి 18 (జనంసాక్షి)**
మునుగోడు నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నమైన డిండి ఎత్తిపోతల పథకం నీటి తరలింపులో ఇంజనీర్లు అనుసరిస్తున్న నిబంధనలు ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేసేలా ఉన్నాయని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మునుగోడు నియోజకవర్గం లోని అన్ని మండలాల తాసిల్దార్లకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ఏదుల రిజర్వాయర్ కు వచ్చే వరద నీటిని పంపిణీ చేసే విషయంలో ఇంజనీర్లు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.వట్టెం రిజర్వాయర్‌కు ఒక నీతి ఏదుల రిజర్వాయర్ నుంచి వట్టెం రిజర్వాయర్‌కు 436 మీటర్ల ఎత్తు నుంచే నీటిని సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశారని తెలిపారు. దేవరకొండ ప్రాంతాలకు నీరందించే డిండి కాలువకు మాత్రం 440 మీటర్ల ఎత్తు నుంచి నీటిని తీసుకోవాలని తప్పుడు సిఫార్సులు చేసి, ఈఎన్సీ చేత సంతకాలు చేయించారని ఆరోపించారు.



ఏదుల రిజర్వాయర్ నుంచి 436 మీటర్ల వద్దే వట్టెంకు నీరు తరలిపోతే, రిజర్వాయర్ మట్టం ఎప్పటికీ 440 మీటర్లకు చేరుకోదని, దీనివల్ల డిండి కాలువలకు కేవలం మత్తడి నీరు మాత్రమే వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వ లక్ష్యం ప్రకారం రోజుకు అర టీఎంసీ నీరు రావాల్సి ఉండగా, ఈ నిబంధన వల్ల కేవలం 1500 క్యూసెక్కుల నీరు మాత్రమే వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల నిర్మించిన 30 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లు వెక్కిరించే పరిస్థితి ఏర్పడుతుందని, ఫ్లోరైడ్ పీడిత ప్రాంత ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. ఏదుల రిజర్వాయర్ నుంచి ఇరువైపులా వట్టెం, డిండి 436 మీటర్ల ఎత్తు నుంచే నీటిని విడుదల చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మునుగోడు నియోజకవర్గంలోని అన్ని మండల తహసిల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందజేశామని తెలిపారు.

# మేలుకో వినియోగదారుడా.. తెలుసుకో"..

## వినియోగదారుల అవగాహన కరపత్రిక ఆవిష్కరణ

**చండూరు మార్చి 18 (జనంసాక్షి)**
జాగృతి వినియోగదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై రూపొందించిన కరపత్రికను ఆర్డీవో వి. శ్రీదేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా "మేలుకో వినియోగదారుడా? తెలుసుకో" అనే నినాదంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, మనిషి మాతృ గర్భంలో రూపుదిద్దుకున్న క్షణం నుంచి మరణం వరకు ప్రతి ఒక్కరూ వినియోగదారులేనని పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచంలో లభిస్తున్న నిత్యావసర వస్తువుల నాణ్యతపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశంలో వినియోగ దారుల హక్కులను పరిరక్షించేందుకు 1986 డిసెంబర్ 24న వినియోగదారుల పరిరక్షణ చట్టం అమల్లోకి వచ్చిందని గుర్తుచేశారు. వినియోగదారులు



కొనుగోలు చేసిన వస్తువుల్లో లోపాలు ఉన్నా లేదా సేవలు సంతృప్తికరంగా లేకపోయినా సంబంధిత ఉత్పత్తిదారులు, విక్రేతలను సంప్రదించి తగిన నష్ట పరి హారం పొందే హక్కు వారికి ఉందన్నారు. ఈ హక్కులు, బాధ్యతలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కరపత్రికను విడుదల చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వినియోగదారులందరూ తమ హక్కులను తెలుసుకుని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తిరందాసు ఆంజనేయులు, గండూరి నరసింహ, తాందారి యాదయ్య, జూలూరి వెంకటేశం, గంజి వెంకటేశం, జెల్లా కన్నెయ్య తదితరులు పాల్గొన్నారు.



### జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులకు ఆర్థిక సహాయం

### మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు

**కొండమల్లేపల్లి, మార్చి 18 (జనంసాక్షి):**
కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సోలిడార్ తెలంగాణ బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు 15 మంది ఆలిండియా స్పోర్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ది డెఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నారు. రాష్ట్ర స్థాయిలో 19 మంది బధిరుల విద్యార్థులు ఎంపిక కాగా అందులో 15 మంది మన విద్యార్థులే ఉండడం హర్షణీయం. జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులు అందరూ గ్రామీణ పేద విద్యార్థులు కావడంతో దాతల అవసరం ఉందని విషయం తెలుసుకున్న మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు రవాణా భోజన వసతి ఖర్చుల నిమిత్తం 15వేల రూపాయల నగదును పాఠశాల ఇంచార్జ్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందించారు. అనంతరం మాజీ వైస్ ఎంపిపి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సహిస్తుందన్నారు. జాతీయ స్థాయిలో ఎంపికైన క్రీడా విద్యార్థులు మరింత ప్రతిభ కనబరిచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు. వారివెంట వార్డు సభ్యులు బత్తుల విజయ్, పాఠశాల ఇంచార్జ్ సురేష్ కుమార్, ప్రధానోపాధ్యాయులు వినోద్ కుమార్, కవిత టీచర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్
- ఇ ఎల్ వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఎంసెట్, నీట్ కోచింగ్

**చౌటుప్పల్, మార్చి 18(జనంసాక్షి)**
విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని నిరుపేద విద్యార్థుల కోసం ఉచిత ఎంసెట్ , నీట్ కోచింగ్ తరగతులను ప్రారంభిస్తు న్నామని తెలిపారు. మధ్యతరగతి, నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు కావాలనే తమ కలను నిజం చేసుకునేందుకు ఈ ఉచిత శిక్షణ ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. నాణ్యమైన కోచింగ్ అందజేయడం ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులను పోటీ పరీక్షల్లో విజేతలుగా నిలపడమే ఈ ఫౌండేషన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు తమ పూర్తి బయోడేటాతో 96344 43338




నంబర్‌కు వాట్సాప్ లో సమర్పించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# వ్యాపార రంగంలో యువత రాణించాలి

### ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్

**చౌటుప్పల్, మార్చి 18 (జనంసాక్షి):**
వ్యాపార రంగంలో యువత రాణించాలని ఇఎల్వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగ దిండ్ల భాస్కర్ ఆకాంక్షించారు. మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన గాన్విక కిరాణం దుకాణాన్ని బుధవారం అయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వ్యాపార ప్రోత్సాహకంలో భాగంగా 25 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానికంగా చిన్న వ్యాపారాలు అభివృద్ధి చెందడం సంతోషకరమని పేర్కొన్నారు.ఫౌండేషన్ ఎప్పుడూ కష్టాల్లో ఉన్నవారికి, కొత్తగా ఎదగాలనుకునే వారికి అండగా ఉంటుందని తెలిపారు.చిన్న చిన్న వ్యాపారాలను మనమందరం ప్రోత్సహించినప్పుడే స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొయ్యడ శేఖర్ గౌడ్ ,ఆలె చిరంజీవి,ఉదరి యాదయ్య, ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు ఆసరాగా దేవరకొండ ఈద్గా, మక్కా మసీదు కమిటీ

**○నిరుపేదలకు రంజాన్ తోఫా పంపిణీ చేసిన కమిటీ ○దాతల సహకారంతో రంజాన్ మాసంలో బియ్యం, వంట సామాగ్రి 518 ప్యాకేజీల పంపిణీ విజయవంతం ○ ప్రతి ఒక్కరూ రంజాన్ ను ఘనంగా జరుపుకోవాలి ○దాతల సహకారంతోనే నిరుపేదలకు ప్రతిఫలం ○ దాతల సహకారం ఎప్పటికీ మరువలేనిది ○సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపిన అధ్యక్షులు సయ్యద్ అజీమోద్దీన్**





**దేవరకొండ, మార్చి 18(జనంసాక్షి)**
పేదలను ఆదుకోవడంలోనే మధురాను భృతి కలుగుతుందని , ప్రతి ఒక్కరూ సాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని దేవరకొండ సయ్యద్ ముఫ్తి అంజత్ సహాబ్ తెలిపారు.బుధవారం పట్టణంలోని మక్కా మసీదులో పట్టణ దాతల ద్వార మక్కా మసీద్ మరియు ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ ప్యాకేజీ బియ్యం వంట సామాగ్రి పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గం ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ పర్వదిన ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ పండుగను ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకోవాలని కోరారు.పవిత్ర రంజాన్ శుభ సందర్భంగా దేవరకొండలో ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, సంతోషంగా మెలగాలని ఆశభావం వ్యకం చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పున్న వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో నియమ నిష్ఠతో ప్రత్యేక ప్రార్థనలతో ముస్లిం సోదరులు ఉపవాసాలు పాటిస్తున్నారని,నియోజకవర్గ ముస్లిం వర్గానికి తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు. ముస్లింల సమస్యల కొరకు తానను ఎప్పుడైనా కలవచ్చునీ, అనంతరం ముందస్తుగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఈద్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీముద్దీన్ మాట్లాడుతూ దేవరకొండ దాతల సహాయ సహకారాలతో 518 మంది పేద వర్గాలకు చెందిన వితంతువులకు , దివ్యాంగులకు , రంజాన్ ప్యాకేజీ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ ప్యాకేజీ కి సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ముందు ముందు కూడా మీ అందరి సహకారంతో ఎక్కువ మంది నిరుపేద కుటుంబాలకు ఆర్థిక చేయూతనిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతామని, మరిన్ని ఖైర్ పనులు చేస్తామని అన్నారు. ఆర్థిక సాయం అందిస్తూ తోడ్పాటు అందించిన దాతలకు, ఇంతటి మహోత్తరమైన కార్యక్రమానికి తమ విలువైన సమయాన్ని కేటాయించిన యువతకు తను ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని అన్నారు. దాతల సహకారంతోనే ఈ రోజు నిరుపేదలకు ప్రతిఫలం లభించిందని, మీ అందరి సహాయ సహకారాలు ఈద్గా కమిటీకు ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని , సహకరించిన ప్రతి ఒక్కరికి యావత్తు ముస్లిం తరపున, కమిటీ తరుపున సయ్యద్ ముఫ్తి అంజత్ సహాబ్దుఆ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజిమోద్దీన్, మాజీ అధ్యక్షులు నజీర్ అహ్మద్, మాజీ వైస్ చెర్మన్ రహత్ అలీ, మదర్సా మిస్బా ఉల్ ఉలూం నజీమ్ సాదీక్ అలీ, కౌన్సిలర్లు, ముస్లిం మత పెద్దలు యువకులు ఈద్గా కమిటీ జనరల్ సెక్రటరీ మహమ్మద్ ఇలియాస్ పటేల్, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఖదీర్, మొహమ్మద్ జాఫర్ ఖాన్,మొహమ్మద్ షబ్బీర్, సెక్రటరీ ఎస్ కే బరాన్, జాయింట్ సెక్రటరీ మహమ్మద్ ఖాజా మొహీనొద్దీన్ , మొహమ్మద్ కైసర్ అసిస్టెంట్ సెక్రటరీ మహమ్మద్ ముజీబ్, సయ్యద్ అజీజ్,కమిటీ మెంబర్లు, సయ్యద్ దస్తగీర్,మొహమ్మద్ యూసుఫోద్దీన్(సలీం),ముస్లిం యువత తదితరులు పాల్గొన్నారు.

## పేద ముస్లిం కుటుంబాల్లో రంజాన్ తోఫా వెలుగులు

### తోపుచర్ల మసీదులో 35 మందికి కానుకల పంపిణీ

### తహసీల్దార్ సరోజ పావని, సర్పంచ్ పార్వతమ్మ చంటి

**మాడ్గులపల్లి, మార్చి 18 ( జనం సాక్షి):**
రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులు పండుగను సంతోషంగా జరుపుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం అందజేస్తున్న రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం బుధవారం మండల పరిధిలోని తోపుచర్ల గ్రామంలో ఘనంగా జరిగింది. స్థానిక మసీదు ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరోజ పావని, గిర్ధవారి సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ పార్వతమ్మ చంటి ముఖ్య అతిథులుగా హాజరై, గ్రామానికి చెందిన 35 మంది అర్హులైన ముస్లిం లబ్ధిదారులకు పండుగ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, పండుగ వేళ ప్రతి పేద కుటుంబం సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కానుకలను అందజేస్తోందని, ముస్లిం సోదరులందరూ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. సర్పంచ్ పార్వతమ్మ చంటి మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే తోపుచర్లలో పండుగ సంబరాలు అందరి మధ్యన జరగడం సంతోషదాయకమన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, ముస్లిం మత పెద్దలు, స్థానిక నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

### బిజెపి రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ జ్యోతి రెడ్డి

**వలిగొండ, మార్చ్ 18 (జనం సాక్షి)**
మండలం బిజెపి రాష్ట్ర నాయకులు ఏలే చంద్రశేఖర్ జ్యోతి రెడ్డి తెలుగువారి తొలి పండుగ ఉగాది సందర్భంగా మాట్లాడుతూ ఉగాదిలో ఉగా అంటే నక్షత్ర గమనం. నక్షత్ర గమనానికి ఆది ఉగాది అంటే సృష్టి ఆరంభమైన దినమే ఉగాది. మామిడి పువ్వుకు మాట వచ్చింది. కోకిల గొంతుకు కూత వచ్చింది. వేప కొమ్మకు పూత వచ్చింది. పసిడి బెల్లం తోడొచ్చింది. గుమ్మానికి పచ్చని తోరణం వచ్చింది. కొత్త ఆశయాలతో నూతన ఉత్తేజంతో ముందుకు సాగాలని మీ జీవితం సుఖసంతోషాలతో ,అష్ట ఐశ్వర్యాలతో విరజిల్లాలని కోరుకుంటున్నా ను అన్నారు.



## పరామర్శ

నూతనకల్ మార్చి18( జనంసాక్షి)
మండల కేంద్రంలోని పిఆర్టియు ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర నాయకుడు మహేశ్వరం వెంకటయ్య కు ఇటీవల గుండె సంబంధిత సర్జరీ కావడం జరిగింది బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, వెంకటయ్య ఇంటికి వెళ్లి పరామర్శించి ఆయు ఆరోగ్యాల గురించి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి, సర్పంచ్ గుగులోతు కృష్ణ నాయక్, మాజీ సర్పంచ్ మహేశ్వరం చంద్రకళ, బంటు బద్రి, కృష్ణ ప్రశాంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజలకు మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఉగాది శుభాకాంక్షలు

**హాలియా, మార్చి 18 జనంసాక్షి :**


నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ శ్రీ పరాభవ నామ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది మన వారసత్వపు పండుగ అని పండుగలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, కళలు జాతిని సజీవంగా నిలుపుతాయని తెలిపారు. వ్యవసాయ సంవత్సరంగా పరిగణించే ఈ ఉగాది రైతులకు, ప్రజలకు అన్ని రంగాల్లో శుభాలను చేకూర్చాలి అని మంత్రి ఆకాంక్షించారు. సమృద్ధిగా పంటలు పండి, ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని అభిలాషించారు. ప్రకృతితో మమేకమై, వ్యవసాయ ఉత్పత్తి సంబంధాల్లో పరస్పర సహకారం ప్రేమాభిమానాలతో పాల్గొనే సబ్బండ వర్ణాలకు, ఉగాది గొప్ప పండగ అన్నారు.ఉగాది పచ్చడిలోని షడ్రుచుల మాదిరిగానే జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను సమానంగా స్వీకరిస్తూ ముందుకు సాగాలన్నారు. శ్రీ పరాభవ నామ సంవత్సరంలో తెలంగాణతో పాటు, దేశం మరింత అభివృద్ధి సాధించాలి అని ఆకాంక్షించారు.

## గ్రామపంచాయతీ అభివృద్ధికై కలెక్టర్ కు వినతి సర్పంచ్ సరిత కృష్ణ యాదవ్

**నూతనకల్ మార్చి18 ( జనంసాక్షి)**



మండల పరిధిలోని యడవల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు గ్రామ సర్పంచ్ జటంగి సరిత కృష్ణ ముందడుగు వేశారు గ్రామ అభివృద్ధి కోసం అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఐఏఎస్ ను కలిసి వినతిపత్రం అందించారు గ్రామంలో మౌలిక వసతులను మెరుగుపరచడం లక్ష్యంగా సి.సి రోడ్ల నిర్మాణం, అంగన్వాడీ భవనాల నిర్మాణం చేపట్టాలని కోరారు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను పి.ఎం శ్రీ పథకం కింద గుర్తించి, అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు సర్పంచ్ సరిత కృష్ణ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం సహకారం అత్యంత అవసరమని తెలిపారు గ్రామ అభివృద్ధి పనులు త్వరితగతిన ప్రారంభమైతే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, ప్రతిపాదనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు చెప్పారు.

## పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన తహసీల్దార్ దేవా సింగ్

నాంపల్లి, మార్చి 18 (జనంసాక్షి)
నాంపల్లి మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి హిందీ పరీక్ష జరుగుతున్న తీరును బుధవారం నాంపల్లి తహసీల్దార్ గూగులోత్ దేవా సింగ్, ఎంఈఓ మల్లికార్జునరావు పరిశీలించారు. పరీక్ష కేంద్రాన్ని తనిఖీలు చేసి, విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటును పరిశీలించారు. మోడల్ స్కూల్ లో 200 విద్యార్దులు, హైస్కూల్లో 190 విద్యార్థులు హాజరయ్యారు. 100%మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఈఓ తెలిపారు. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా బుధవారం హిందీ పరీక్ష తీరును జడ్పిహెచ్ఎస్ నాంపల్లిలో పరీక్ష కేంద్రాన్ని నాంపల్లి తహసీల్దార్ గూగులోతు దేవాసింగ్, ఎంఈఓ మల్లికార్జునరావు తనిఖీలు నిర్వహించారు.





## నిరుపేద ముస్లీంలకు రంజాన్ తోఫా పంపిణీ

**బూర్గంపహాడ్ మార్చి 18 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్మండల పరిధిలోని సారపాక మసీద్ లో నిరుపేద ముస్లీం మహిళలకు జిల్లా మైనార్టీ అధ్యక్షులు పఠాన్ మహమ్మద్ఖాన్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫాను అందజేయగా ఈ తోఫాను మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ కిషోర్నాయక్ చేతులమీదుగా అందజేశారు. రంజాన్ పండుగను నిరుపేద ముస్లీంలు కూడా జరుపుకోవాలని వారికి ఈ తోఫా అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, ముస్లీం సోదరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీకి సీసీ కెమెరాలు విరాళం



**వలిగొండ,మార్చి 18( జనంసాక్షి)**

మండలంలోని ఎదులగూడెం గ్రామ పంచాయతీకి సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం ఉప సర్పంచ్ కొలను విజయ వెంకట్ రెడ్డి 1,26,000 రూపాయలు సర్పంచ్ కొంతం శ్రీనుకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు మునుకుంట్ల భవాని, గునిగంటి నరేష్, గంజి సప్న, కూకుంట్ల రాధ, గుమ్మడి జనార్దన్ రెడ్డి,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలను ఎవరైనా దహనం చేస్తే చట్టరీత్యాశిక్ష

**వలిగొండ, మార్చి 18 (జనం సాక్షి)**



మండలంలో వెల్వర్తి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్డు పక్కన నాటిన మొక్కల దహనం చేసిన ఘటన ఎంపీడీవో జలంధర్ రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించి, మాట్లాడుతూ హరితహారం మొక్కలను ఎవరైనా దానం చేస్తే చట్టరీత్య శిక్ష ఉంటుందని అన్నారు. దర్యాప్తు కొనసాగుతుందని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరా వృతం కాకుండా కట్టిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై గ్రామ కార్యదర్శి నరేందర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు నమోదు చేశారు.

## డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన

**చిలుకూరు, మార్చి 18, (జనంసాక్షి):**

మండలంలోని జానకినగర్ గ్రామంలో ఉపాధి హామీ నిధులతో డ్రైనేజ్ నిర్మాణ పనులకు బుధవారం సర్పంచి అనూష శంకుస్థాపన చేశారు. పథకం నుంచి మంజూరైనా రూ. 5లక్షలతో గ్రామంలోని 5,6,7,8 వార్డులలో డ్రైనేజీలు నిర్మిస్తున్నారని సర్పంచ్ అనూష తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాఘవేంద్ర, వార్డు సభ్యులు చంద్రకళ ,స్వాతి , ఉపేందర్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు నెల్లూరి బ్రహ్మ చారి,నాయకులు అమృనాయక్,రాజేష్,రవి,శివాజీ ,చినా, వెంకటేశ్వర్లు,ఠాగూర్, తదితరులు పాల్గొన్నారు.





## చెరువులోకి నీరు రైతన్న కళ్ళల్లో ఆనందం

**వలిగొండ, మార్చి 18 (జనంసాక్షి)**

ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాలంలో బునాది గాని కాలువకు శిలాఫలకం వేయబడింది. కానీ తరువాత వచ్చిన 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టును, అలాగే ఇక్కడి రైతుల సమస్యలను పట్టించుకోలేదు.మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత, వలిగొండ మండల ప్రజానాయకుడు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రాజెక్టును పట్టుదలగా ముందుకు తీసుకెళ్లి 240 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ప్రాణహిత-చేవెళ్ల కాలువ పనులను పూర్తి చేసి, హైదరాబాద్?వరంగల్ హైవే వద్ద రోడ్డు కట్ చేసి, కేవలం ఆరు నెలల్లో కల్వర్టు నిర్మాణం పూర్తి చేసి, ఈ కాలువ ద్వారా బునాది గాని చెరువును నింపడం జరిగింది.ఈ విజయానికి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కృషి కారణమని ఇక్కడి రైతులందరికీ స్పష్టంగా తెలుసు. కానీ బిఆర్ఎస్ నాయకులు అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బద్దం కరుణశ్రీ పవన్ కుమార్ రెడ్డి, సర్పంచ్ బాలస్వామి ,మండల అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి,బత్తిని సహదేవ్,కాసుల వెంకన్న , రేఖల ప్రభాకర్ , కొండూరు సాయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చాలి

**కనగల్లు, మార్చి 18 (జనంసాక్షి)**



ఎన్నికల మేనిఫెస్టోలు పొందుపరిచిన 6 గ్యారంటీలు 420 హామీలను ప్రజలకి ఇచ్చి వారి ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలు ను తుంగలో తొక్కి కాలయాపన చేస్తుందని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం తాసిల్దార్ బి పద్మకు మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పిండి పాపిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులుపులకరం బిక్షం, చేనేత జిల్లా కౌన్సిల్ సభ్యుడు తిరందాసు కనకయ్య, మండల అధ్యక్షుడు పి బిక్షం, ప్రధాన కార్యదర్శి పంతంగి సైదులు గౌడ్, దాసరి వెంకన్న, ముత్యాల మధు, చెనగోని యాదగిరి, పల్లె గో నీసైదులు నరేందర్ గౌడ్, దుర్గ ప్రసాద్, పగడాల వెంకన్న, బొమ్మ కంటి సైదులు, భూత అధ్యక్షులు తదితరులున్నారు.

## ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసే పండుగ ఉగాది

- రెయిన్ బో పాఠశాలలో ఉగాది పండుగ సంబరాలు
- రెయిన్బో పాఠశాల కరస్పాండెంట్ ఆనంద్ రెడ్డి

**కొండమల్లేపల్లి, మార్చి 18 (జనంసాక్షి):**



కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని సాగర్ రోడ్డులో గల రెయిన్ బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ ఉత్సవాన్ని కరస్పాండెంట్ యం. ఆనంద్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు, నృత్యాలు, వేషాధారణ, ఆటపాటలతో అందరినీ అలరించి తెలుగు పండుగ ఉగాది గొప్పతనాన్ని చాటారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ జీవితం తీపి చేదు జ్ఞాపకాల కలయిక అని వాటన్నింటినీ కృతజ్ఞతతో స్వీకరించాలని ఉగాది అంటే కొత్త ప్రారంభాలకు శుభాలకు సంకేతం అని అన్నారు. ఉగాది పచ్చడి, దానిలోని రుచులను అనగా బెల్లం ఆనందం, వేపపువ్వు బాధ, చింతపండు ఆశ్చర్యం, మిరప కోపం, ఉప్పు జీవితంలో రుచులు, వగరు కొత్త అనుభవాలను గురించి విద్యార్థులకు వివరించారు. జీవితం ఒక మిశ్రమం అని ఎలాంటి పరిస్థితినైనా ధైర్యంగా ఎదుర్కోవాలని కొత్త సంవత్సరాన్ని సానుకూలంగా ప్రారంభించి పండుగ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పర్వీన్ సుల్తానా, బాలయ్య, సుష్మ, శ్రీలత, నాగమణి, శైలజ, కళ్యాణి, విజయలక్ష్మి, నిఖిత, కీర్తి చందన, ధవమ్మ, ధనలక్ష్మి, అంకిత, సరిత, అనంతలక్ష్మి, హెప్సిబా, సుజాత, మాధవి, లలిత, కావ్య, సిహెచ్ శోభారాణి, శోభారాణి, సువర్ణ, సరస్వతీ, స్వాతి, డ్రాయింగ్ టీచర్ ఉమామహేశ్వరి, పిఈటి సంధ్య, డ్యాన్స్ మాస్టర్ చిన్నా తదితరులు పాల్గొన్నారు.



## తడి, పొడి చెత్త పై కళాశాల విద్యార్థులకు అవగాహన

**బూర్గంపహాడ్ మార్చి 18 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల పరిధిలోని ఇరవెండి గ్రామ పంచాయతీలో స్వచ్ఛ సర్వేక్షన్ మిషన్ గ్రామీణ్ భాగంగా పాల్వంచ డిగ్రీ కళాశాల విద్యార్థులకు తడి, పొడి చెత్త, ప్రమాదకర చెత్త, వర్మికంపోస్ట్ తయారీ తదితర అంశాలపై సర్పంచ్ గుండి బాబూరావు, ఉపసర్పంచ్ మహంకాళి రామారావు లు బుధవారం అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమానికి అడిషనల్ డీఆర్డీవో రవి, ఎంపీడీవో జమలారెడ్డి లు హాజరయ్యారు. పంచాయతీ కార్యాలయం నుంచి డంపింగ్ షెడ్ వరకు విద్యార్థులతో ర్యాలీగా వెళ్లి అక్కడ వర్మికంపోస్ట్ తయారీ, తడి, పొడిచెత్త వేరుచేయడంపై ఎస్పీఎం రేవతి అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్ధాలను వివరించి ప్లాస్టిక్ నివారణకు కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు దుర్గ, లక్ష్మి, బత్తుల శిరీష, కరం సామ్రాజ్యం, కార్యదర్శి స్పందన, ఏపీవో, ఈసీ, టీఏ, ఎఫ్ఎలతో పాటు కళాశాల అధ్యాపకులు, గ్రామపంచాయతీ మల్టీపర్సస్ వర్కర్లు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సమస్యలపై గలమెత్తిన ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు

**- ప్రెస్ క్లబ్ మండల ప్రధాన కార్యదర్శి కలకొండ సంజీవ**

**సంస్థాన్ నారాయణపురం. మార్చి 18. (జనం సాక్షి ):**

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలి లో ప్రస్తావించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కు జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమం, భద్రత వేతన సమస్యలు గుర్తింపు కార్డుల జారీ వంటి కీలక అంశాలను ఎమ్మెల్సీ ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ మండల ప్రధాన కార్యదర్శి కలకొండ సంజీవ మాట్లాడుతూ తమ సమస్యలను సభలో ప్రస్తావించడం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినందుకు ఎమ్మెల్సీకి అభినందనలు తెలిపారు. జర్నలిస్టులు సమాజానికి అద్దం పట్టే వర్గం అని వారి సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వం బాధ్యతను పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు ఆరోగ్య భీమా , ఇంటి స్థలాలు వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం చేసిన ఈ ప్రయత్నం జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు దోహదపడుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో జర్నలిస్టుల గొంతుకగా నిలిచిన ఎమ్మెల్సీకి పత్రికా వర్గాలు కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులో కూడా ఇలాంటి సహకారం కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ నాయకులు పి.వెంకటేశ్వర్లు,చిలివేరు సంజీవ, యస్ బాలరాజు, జర్నలిస్టుమిత్రులు పాల్గొన్నారు.



# ఖమ్మం జిల్లాలో ట్రైబల్ వెల్ఫేర్ అధికారుల నిర్లక్ష్యం

**○ఖమ్మం జిల్లా డిడి, ఏటీడీఓ లను సస్పెండ్ చేయాలి ○గిరిజన కమిషనర్‌కు యూఎస్ఎఫ్ఐ వినతి**

**ఖమ్మం, (జనంసాక్షి) :**
జిల్లాలో ట్రైబల్ వెల్ఫేర్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థుల భద్రత ప్రమాదంలో పడుతోందని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొట్ల సాగర్ ఆరోపించారు. జిల్లా గిరిజన శాఖలో నెలకొన్న పలు సమస్యలపై తెలంగాణ రాష్ట్ర గిరిజన కమిషనర్ సంతోష్ కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ముదిగొండ మండలం వల్లభి ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శ్వేత అనే విద్యార్థిని పాఠశాల హెడ్‌మాస్టర్, హాస్టల్ సిబ్బంది వేధింపుల కారణంగా ఐరన్ టాబ్లెట్లు తీసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ సిబ్బంది, ఏఎన్ఎం ప్రాథమిక చికిత్స అందించినప్పటికీ టాబ్లెట్లు తీసుకున్న విషయం తల్లిదండ్రులకు తెలియజేయకుండా విద్యార్థిని ఇంటికి పంపించారని ఆరోపించారు. తరువాత ఆరోగ్యం క్షీణించడంతో తల్లిదండ్రులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారని తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ



శ్వేత మృతి చెందిందని పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన పాఠశాల హెడ్‌మాస్టర్, సంబంధిత ఏటిడిఓపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ డీడీ విజయలక్ష్మి హాస్టళ్లపై పర్యవేక్షణలో విఫలమయ్యారని, ఏటిడిఓ నెలవారీ సమావేశాలు కూడా నిర్వహించడం లేదని విమర్శించారు. హాస్టళ్లలో సమస్యలపై కనీస అవగాహన కూడా లేదని పేర్కొన్నారు. విద్యార్థి సంఘం తరఫున పలుమార్లు సమస్యలు వెల్లడించినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని యూఎస్ఎఫ్ఐ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. డీడీపై తక్షణ చర్యలు తీసుకుని విధుల నుంచి తొలగించాలని కోరారు.



## దమ్మపేటలో సివిల్ సప్లై అధికారులు మెరుపు దాడులు.

### పలు హోటల్ పై రైడింగ్,చర్యలు

**దమ్మపేట మార్చి 18 (జనంసాక్షి):**
దమ్మపేటలోని పలు హోటళ్లపై సివిల్ సప్లై అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. మండల కేంద్రంలోని హోటళ్లపై ముమ్మర తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లల్లో ఉపయోగించే గ్యాస్ సిలిండర్లను పలు హోటలలో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో,ఇతర వ్యాపార కార్యకలాపాల్లో నిర్వహిస్తున్న వారిపై తగు చర్యలు చేపట్టారు. అక్రమంగా ఉపయోగిస్తున్న 36 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. సామాన్యులు వినియోగించే సిలిండర్లను వ్యాపారం కోసం ఉపయోగిస్తే తగు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. పట్టుబడిన వారిపై సెక్షన్ 6ఏ కింద కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకొనబడతాయని అధికారులు తెలిపారు.



## ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కు స్వాగతం పలికిన అధికారులు

**బూర్గంపహాడ్ మార్చి 18 (జనంసాక్షి)**
భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కార్పోరేషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మూడు రోజుల పర్యటనలో భాగంగా సారపాకలోని ఐటీసీ అతిథిగృహానికి బుధవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కార్పోరేషన్ చైర్మన్ కు ఐటీడీఏ డీడీ అశోక్, ఎస్సీ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీలత, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ ఉపేందర్లు పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కేఆర్ కె ప్రసాద్, దమ్మపేట ఏటీడీవో చంద్రమోహన్, భద్రాచలం ఏఎస్ డబ్ల్యూ హనుమంతరావు, పాల్వంచ ఏఎస్ఐడబ్ల్యువో, హెడబ్ల్యువో అక్షయ్, సంక్షేమశాఖ, ఎస్సీ కార్పోరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో ఘనంగా 'ఉగాది' వేడుకలు

**ఖమ్మం, (జనంసాక్షి) :**
స్థానిక శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్‌లో తెలుగు సంవత్సరాది (ఉగాది) వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో తెలుగు వారికి అత్యంత ప్రీతిపాత్రమైన తెలుగు సంవత్సరాది ఐన ఉగాది పండుగను విద్యార్థులు నూతన వ స్త్రాలు ధరించి, మామిడి తోరణాలను తరగతి గదులకు అలంకరించి, నవ వసంతాన్ని స్వాగతిస్తూ షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని తమ స్నేహితులకు, ఉపాధ్యాయులకు పంచుతూ శుభాకాంక్షలు తెలుపుకుంటూ తమ స్వచ్ఛమైన మనస్సుతో ఆనందతన్మయత్వం చెందారు. చిరునవ్వులను చిందిస్తూ ఎంతో ఉత్సాహంగా కేరింతల నడుమ ఉగాది పండుగను జరుపుకోవడం జరిగింది, పంచాంగ శ్రవణం ఎంతో ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమములో స్కూల్ డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు పాల్గొని మాట్లాడుతూ యుగానికి నాంది ఉగాది అంటూ ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పాడ్యమి నాడు ఎంతో భక్తిశ్రద్ధలతో తెలుగువారందరూ జరుపుకునే తొలి పండుగ అంటూ తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు ఆరు రుచుల కలయికతో ఉగాది




పచ్చడి చేసి కుటుంబమంతా సేవించి, ఆ ఆరు రుచులను జీవితంలో వచ్చే కష్టసుఖాల కలయికగా భావించి ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొగల వ్యక్తిత్వాన్ని అలవాటు చేసుకోవాలి అని తెలియజేసారు. షడ్రుచుల మాదిరిగా రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, వినయం, ఆటలు, సంగీతం, కంప్యూటర్ విద్యల జ్ఞానాన్ని అందిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా ఉన్నతమైన ప్రణాళికను నిర్వహిస్తున్నామంటూ మన పండుగలు, సంస్కృతులను మనం తెలుసుకోవాలంటూ వివరిస్తూ అందరికి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమములో డైరెక్టర్ కొండా కృష్ణవేణి పాల్గొని, ప్రతి విద్యార్థికి తమ జీవితంలో జయాపజయాలు, కష్టసుఖాలు, మంచి చెడులు ఉగాది పచ్చడిలోని ఆరు రుచుల సమ్మేళనం వలే ఉంటాయని పండుగ యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యేయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిందే.. మార్చి 20న 'చలో అసెంబ్లీ'!

- కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్, సమగ్ర శిక్ష ఉద్యోగులుకు ఉద్యోగ భద్రత కోసం ఉద్యమాలు
- తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్

**ఖమ్మం, (జనంసాక్షి) :**
రెండు దశాబ్దాల కాలంగా కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్ మరియు సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు కనీస వేతనాలు కూడా అమలు కాక తీవ్రమైన శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోకపోవడంతో ఈ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో భవిష్యత్తుపై



ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ సమస్యలను ప్రభుత్వ దృష్టికి ఎన్నోసార్లు తీసుకెళ్లినా సరైన పరిష్కారం లభించలేదని ఆయన అన్నారు. ఉద్యోగుల హక్కుల కోసం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నిరంతరం ఆందోళనలు, పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తూ కొన్ని సమస్యలను పరిష్కరించగా మరికొన్ని సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని కొనసాగిస్తున్నదని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కేజీబీవీ, యుఆర్ఎస్ మరియు సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ కనీస వేతనం, బేసిక్ పే చెల్లించాలని, పిఆర్సీ సిఫారసుల ప్రకారం రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యోగులకు సాధారణ సెలవులు వినియోగానికి అర్హత కల్పించి నెలకు రెండు సెలవుల పరిమితిని ఎత్తివేయాలని, రెగ్యులర్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని రకాల సెలవులు వర్తింప చేయాలని కోరారు. ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇచ్చి నగదు రహిత వైద్యం అందించాలి, హాస్టల్ నిర్వహణ కోసం కేర్‌టేకర్ నియమించాలి, సిఆర్టీలు మరియు పీజీసిఆర్టీలకు నైట్ డ్యూటీ నుండి మినహాయింపు ఇవ్వాలని అన్నారు. స్వల్ప కారణాలతో ఉద్యోగు లను తొలగించడం అన్యాయం అని పేర్కొంటూ వారికి ఉద్యోగ భద్రత కల్పిం చాలని డిమాండ్ చేశారు. కేజీబీవీలలో పనిచేస్తున్న అన్ని పోస్టుల జాబ్ చార్ట్‌ను అప్డేట్ చేసి డ్యూటీ టైమింగ్స్‌పై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని అన్నారు. మెస్ చార్జీలు ఒక నెల ముందు గానే విడుదల చేయాలని, రెండో శనివారం మరియు ఆప్షనల్ సెలవులు వినియోగానికి అవకాశం ఇవ్వాలని, రిటైర్మెంట్ సమయంలో అంగనవాడి ఉద్యోగులకు ఇచ్చినట్లే బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. రెసిడెన్షియల్ విధానంలో పనిచేస్తున్నందున ఉద్యోగులకు క్వార్టర్స్ వసతి కల్పించాలని, యుఆర్ఎస్ పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని సూచించారు. అలాగే స్కూల్ కార్యకలాపాల ఫోటోలు ప్రతిరోజూ వాట్సాప్‌లో పెట్టాలని బలవంతం చేయడం మానుకోవాలని అన్నారు. యస్ఓలను ప్రిన్సిపాల్స్‌గా, పీజీసిఆర్టీలను జూనియర్ లెక్చరర్లుగా, సిఆర్టీలను స్కూల్ అసిస్టెంట్లుగా గుర్తించి ఆ పోస్టులకు తగిన బేసిక్ పే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఆర్సీ సిఫారసుల ప్రకారం ప్రతి సంవత్సరం వెయ్యి రూపాయల ఇంక్రిమెంట్ ఇవ్వాలని, కేజీబీవీలలోని జూనియర్ కళాశాలలకు అదనపు సిబ్బంది మరియు నిధులు కేటాయించాలని కోరారు. యుఆర్ఎస్ పాఠశా లల్లో 9, 10 తరగతులు ప్రారంభించాలని సూచించారు. అదేవిధంగా అర్ధాంతరంగా మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. 2024?25 సంవత్సరంలో నిర్వహించిన 29 రోజుల సమ్మె కాలపు వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మార్చి 20వ తేదీన "చలో అసెంబ్లీ" కార్యక్రమాన్ని చేపట్టినట్లు షేక్ రంజాన్ తెలిపారు.

# ప్రతిష్ట మహోత్సవానికి ముస్తాబవుతున్న శ్రీ కుబేర ఆనీజనేయ స్వామి

## యంత్ర సహిత విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ట

**పెనుబల్లి, మార్చి 18 (జనంసాక్షి)**
ఈనెల మార్చి 25న ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం పెనుబల్లి గ్రామనీలో ఆర్యవైశ్య కళ్యాణ మండపం పక్కన ప్రతిష్ట మహోత్సవానికి యంత్ర సహిత శ్రీ కుబేర ఆంజనేయ స్వామి ముస్తాబవుతున్నారు. భక్తుల సహాయ సహకారాలతో బుధవారం ఉదయం గం.9-45 నిమిషాలకు మృగశిర నక్షత్ర యుక్త వృషభ లగ్న పుష్కరాంశం నందు యంత్ర సహిత శ్రీ కుబేర ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టతోపాటు యంత్ర సహిత విగ్నేశ్వర స్వామి, సుబ్రమణ్య స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో, విశేష భక్తజన సందోహాల మధ్య,వేద పండితుల వేదమంత్రాల నడుమ ఈ మహోత్సవ కార్యక్రమం జరగనున్నది. ఈ సందర్భంగా గ్రామ భక్తులు ఈ మహత్తర విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని దిగ్విజయంగా నిర్వహించాలనే దృఢ సంకల్పంతో శ్రీ కుబేర ఆంజనేయస్వామి నూతన కమిటీని, కమిటీ అధ్యక్షులు ఆచంటి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు బొర్రా కోటేశ్వరరావు,కోశాధికారి జిల్లెళ్ల వెంకటేశ్వరరావు (జె వి )ఏర్పాటు చేసుకున్నారు. ఈ కమిటీ ద్వారా భక్తుల సహాయ సహకారాలతో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని సౌకర్యాలను భక్తుల ద్వారా దాతల ద్వారా సమకూర్చుకుంటూ ముందుకు సాగుతున్నారు.

**ప్రతిష్ట మహోత్సవంలో భ్రమరాంబ సేవా సమితి సభ్యుల సేవా కార్యక్రమాలు**
ఈ ప్రతిష్టా మహోత్సవంలో తమ వంతు సేవా కార్యక్రమాల్లో భాగంగా గోదాశ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సమితి మహిళా సభ్యురాళ్లు గ్రామంలో ఆడపడుచులకు బొట్టు పెట్టి కుబేర ఆంజనేయ స్వామి కరపత్రాలను, ఆంజనేయ స్వామి కాషాయ రంగుజాండాలను పంపిణీ చేస్తూ ప్రతిష్టా మహోత్సవానికి ఆహ్వానిస్తున్నారు, ఈ ప్రతిష్ట మహోత్సవ విజయోత్సవానికి కుబేర ఆంజనేయ స్వామి కమిటీ తో పాటు భక్తులు, గ్రామస్తులు తమ భక్తి కొలది కార్యక్రమాలను నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి దాతలు తమ వంతు



సహాయ సహకారాలను అందించాలని శ్రీ కుబేర ఆంజనేయ స్వామి కమిటీ వారు ఆశాభావాన్ని వ్యక్తపరుస్తున్నారు.





# ముస్తఫా నగర్‌లో రంజాన్ తోఫా పంపిణీ

**ఖమ్మం, (జనంసాక్షి) :**
పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఖమ్మం నగరంలోని ముస్తఫా నగర్ 23వ డివిజన్ కమ్యూనిటీ హాల్‌లో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సిపిఎం జిల్లా నాయకులు ఎం.ఏ. జబ్బార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ సి. బారవి, ప్రముఖ పారిశ్రామికవేత్త వంగాల కిరణ్ కుమార్, ప్రముఖ వ్యాపారవేత్త భీమవరపు పుల్లారావు చౌదరి, జూబ్లీ ఆఫీసర్ క్లబ్ కార్యవర్గ సభ్యులు వేములపల్లి శ్రీకాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సి. బారవి, ప్రముఖ పారిశ్రామికవేత్త వంగాల కిరణ్ కుమార్ ముస్లిం సోదరులకు రంజాన్ తోఫాలను అందజేశారు. రంజాన్ మాసం పంచుకునే భావన, దానధర్మాలకు ప్రతీకగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. సమాజంలో పరస్పర సహకారం, సోదరభావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు. ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సిపిఎం జిల్లా నాయకులు ఎం.ఏ. జబ్బార్ మాట్లాడుతూ రంజాన్ మాసం మానవతా విలువలను గుర్తు చేసే పవిత్ర కాలమని తెలిపారు. అవసరంలో ఉన్న కుటుంబాలకు సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మెహరున్నిసా బేగం, భాగం అజిత, మండల కార్యదర్శులు షేక్ నాగుల్ మీరా, బోడపట్ల సుదర్శన్, అంబటిపూడి సుధాకర్, కూరపాటి శ్రీను, దాసరి నాగేశ్వరరావు, ప్రముఖులు దాసరి శివ, రంజాన్ బి, షేక్ సత్తార్, షేక్ అక్బర్ బాషా, షేక్ నజీర్, స్థానిక ప్రజలు, ముస్లిం సోదరులు, యువకులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంజాన్ తోఫాలను అందుకున్న వారు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్వీయంలో ఘనంగా ఉగాది సంబరాలు



**ఖమ్మం, (జనంసాక్షి) :**
స్థానిక శ్రీనివాస నగర్ లోని ఎస్. వి. యం సెంట్రల్ పబ్లిక్ పాఠశాల ప్రాంగణంలో శ్రీ 'పరాభవ ' నామ సంవత్సర తెలుగు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని, ఉగాది వేడుకల అత్యంత వైభవంగా, ఉత్సాహభరితమైన వాతావరణంలో జరుపుకున్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు అందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లి దండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జీవితంలోని కష్టసుఖాలకు ప్రతీక అయిన షడ్రుచుల (తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు) సమ్మేళనం తో కూడిన 'ఉగాది పచ్చడి'ని విద్యార్థులందరికీ అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ," ఈరోజు మనం శ్రీ 'పరాభవ' నామ సంవత్సర ఉగాది పండుగను జరుపుకుంటున్నామనీ, ఉగాది అంటే 'యుగాది' – అంటే ఒక కొత్త యుగానికి, ఒక కొత్త కాలానికి ప్రారంభమనీ, పురాణాల ప్రకారం బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించిన రోజు ఇదే అనీ , ప్రకృతి కూడా కొత్త చిగుళ్లతో, కోయిల పాటలతో వసంత కాలానికి స్వాగతం పలుకుతోందనీ అన్నారు. విద్యార్థులు ఆధునిక విద్యతో పాటు మన పండుగల వెనుక ఉన్న అంతరార్థాన్ని, తెలుగు సంస్కృతిని గౌరవించడం నేర్చుకోవాలి" అని ఆకాంక్షించారు. డైరెక్టర్ శ్రీ కొండ శ్రీధర్ రావు మాట్లాడుతూ, ' ఉగాది పండుగలో అత్యంత ముఖ్యమైనది ఉగాది పచ్చడనీ. ఇందులో ఉండే ఆరు రుచులు (తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు) మన జీవితంలోని సుఖదుఃఖాలకు ప్రతీకలనీ, జీవితంలో కేవలం విజయాలే కాదు, అపజయాలు,సవాళ్లు కూడా వస్తుంటాయనీ వాటన్నింటినీ సమానంగా స్వీకరించాలని ఈ పచ్చడి మనకు నేర్పుతుందనీ అన్నారు. ఈ కొత్త సంవత్సరం మీ అందరి జీవితాల్లో కొత్త లక్ష్యాలను, క్రమశిక్షణను మరియు గొప్ప విజయాలను తీసుకురావాలని , మన సంస్కృతిని, భాషను గౌరవిస్తూ ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల డైరెక్టర్ ఉమా మాట్లాడుతూ ' ఉగాది అంటే కేవలం క్యాలెండర్ మారడం కాదనీ, మన ఆలోచనల్లో ఒక కొత్త ఉత్సాహం రావడం, పకృతి ఎలాగైతే పాత ఆకులను విడిచిపెట్టి కొత్త చిగుళ్లతో కళకళలాడుతుందో మనం కూడా గతాన్ని నెమరువేసుకుంటూ, భవిష్యత్తుపై కొత్త ఆశలతో ముందుకు సాగాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు. 'వసంతం – ప్రకృతి' అనే అంశంపై విద్యార్థులు స్వయంగా రాసిన కవితలను చదివి వినిపించారు. తెలుగు భాషా గొప్పతనాన్ని చాటి చెప్పేలా విద్యార్థులు వేసిన బుర్రకథలు, జానపద నృత్యాలు, ఉగాది పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో వేడుకగా

# తెలుగు సంవత్సరాది ఉగాది

**ఖమ్మం మార్చి 18, (జనంసాక్షి) :**
స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో తెలుగు సంవత్సరాది పర్వదినం శ్రీ పరాభవ నామ ఉగాది వేడుకలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు పంచకట్టు, చీరకట్టు, లంగా ఓని తెలుగు సాంప్రదాయ దుస్తులలో మురిసిపోయారు. తొలుత సూర్య భగవానుడికి, ప్రకృతి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం షడ్రుచులతో ఉగాది పచ్చడి తయారు చేశారు. అనంతరం విద్యార్థులందరికీ ఉగాది పచ్చడి అందించారు. పాఠశాలను సాంప్రదాయకరంగా మామిడాకులు, కొబ్బరాకులతో శోభాయ మానంగా తీర్చిదిద్దారు. అనంతరం పాఠశాల చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తెలుగు సాంప్రదాయ పర్వదినాలలో ఉగాది పర్వదినం తొలి రోజులలో వచ్చే పర్వదినమని, ఈ పర్వదినాన్ని తెలుగు సంవత్సరాదిగా తెలుగు లోగిళ్లలన్నింటిలో జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ పర్వదినం రోజు నాటికి ప్రకృతి మాత నూతన శోభను సంతరించుకుంటుందని తెలిపారు. ఈ తెలుగు సంవత్సరాదిని శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సరంగా పిలుస్తారు. 60 సంవత్సరాల తెలుగు సంవత్సరాల లో 33వ తెలుగు సంవత్సరం ఈ పరాభవనామ తెలుగు సంవత్సరాన్ని ప్రస్తుతం జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. తెలుగువారి కుటుంబాలు అన్నింటిలో నూతన శోభ వెల్లివిరియాల అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# త్రివేణి లో ఘనంగా పంచాంగ శ్రవణం



**ఖమ్మం, (జనంసాక్షి) :**
త్రివేణి పాఠశాలలో ఉగాది పండుగ సందర్భంగా ఉత్సవం నిర్వహించడం జరిగింది. ఉదయమే పాఠశాల ఆవరణలో పూజానంతరం పురోహితులు మరియూ గణితశాస్త్ర అధ్యాపకులు మరింగంటి కాశ్యపాచార్యులు పంచాంగ శ్రవణం చేయించారు. అనంతరం ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు విద్యార్థిని విద్యార్థులకు ఉగాది పచ్చడి ప్రసాదంగా ఇచ్చారు ఈ సందర్భంగా పురోహితులు ఉగాది పండుగ యొక్క ప్రాశస్త్యం మరియు షడ్రుచులు ఏ విధంగా మానవ జీవితానికి ప్రతీకలుగా ఉంటాయి అనే అంశాలను వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ ఉగాది పండుగ మన పండుగలలో మొదటిదని ఉగాది పచ్చడి స్వీకరించడం ద్వారా జీవితంలో వచ్చే అన్ని ఒడిదుడుకులను సానుకూల దృక్పథంతో స్వీకరించి ఉన్నత మానవులుగా ఎదగాలని విద్యార్థుల పట్ల ఆయన ఆకాంక్షను వ్యక్తం ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ సంవత్సరం అందరి జీవితాలలో వెలుగులు నింపాలని,అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ,ఈ ఉగాది అందరి జీవితంలో అద్భుతమైన ఫలితాలను ఇవ్వాలని ఆకాంక్షిస్తూ అందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న ,ముస్తఫా , క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ ట్రాన్స్ పోర్ట్ ఇంచార్జి సందీప్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జిల్లా సమస్యలపై ఈనెల 20న నిరసన

## జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్





**భువనగిరి టౌన్, మార్చి 18 (జనంసాక్షి)**
యాదాద్రి భువనగిరి జిల్లా భాజపా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ అధ్యక్షతన ప్రధానమంత్రి సంసద్ కేల్ మహోత్సవ్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ఈ అంశాలపై ఈనెల 20న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ప్రధానమంత్రి సంసద్ కేల్ మహోత్సవ్ ద్వారా విద్యార్థులు, యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందడంతో పాటు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం పెరుగుతాయని పేర్కొన్నారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, మహిళల కోకో పోటీల విజేతలకు ఈనెల 22న భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బహుమతి ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ముఖ్య అతిథిగా, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి మల్లేశం, పోతంశెట్టి రవీందర్, వట్టిపల్లి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు శ్యాంసుందర్ రెడ్డి, పట్నం శ్రీనివాస్, పొన్నాల చంద్రశేఖర్ రెడ్డి, గూడూరు నరోత్తం రెడ్డి, సీనియర్ నాయకులు పడమటి జగన్మోహన్ రెడ్డి, ఏలే చంద్రశేఖర్, రచ్చ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు అచ్చయ్య, కొప్పుల యాది రెడ్డి, చంద మహేందర్ గుప్తా, జిల్లా కార్యదర్శులు వైజయంతి, తడిసిన మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం వివిధ మోర్చా అధ్యక్షులు పట్నం కపిల్ రాజేందర్ రెడ్డి, డి ఎల్ ఎన్ గౌడ్, కస్తూరి మాధురి, జిల్లా మీడియా కన్వీనర్ అక్కోడ రామకృష్ణ, కార్యాలయ కార్యదర్శి మంగు నరసింహారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి రాళ్ల బండి కృష్ణ చారి, దయ్యాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వే ద్వారా భూ తగాదాలకు పరిష్కారం:తహసీల్దార్ పి శ్రీనివాస రావు



**నూతనకల్ మార్చి18( జనంసాక్షి)**
మండల పరిధిలోని యడవెల్లి, పెదనెమిల రెవెన్యూ గ్రామాలలో భూముల రీ సర్వే గురించి బుధవారం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా తహసిల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ భూముల రీ సర్వే వలన కలిగే ఉపయోగాలను మరియు భూతగాదాలు లేకుండా భూ సరిహద్దులను ఏర్పాటు చేయబడును అందరూ రైతులు మరియు ప్రజలు కూడా రి సర్వేకు సహకరించాలని తద్వారా ప్రతి రైతు భూమికి భూధార్ నెంబరు కూడా సర్వే పూర్తి అయిన తదుపరి కేటాయించ బడునని వారు వివరించడం జరిగినది రైతులందరూ కూడా ఇట్టి రీ సర్వే పట్ల సంతోషం వ్యక్తం చేసినారు ఇట్టి కార్యక్రమంలో సహాయ సంచాలకులు సర్వే మరియు ల్యాండ్ రికార్డుల అధికారి శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే ప్రకాష్ ,ఇరు గ్రామాల సర్పంచ్ లు జటంగి సరిత కృష్ణ యాదవ్ , లావణ్య మధుసూదన్ రెడ్డి,మండల సర్వేయర్, ఆర్ఐ హాసన్ అలీ, జిపిఓ కవిత, అనిల్, నరసింహారావు, కార్యాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

సూర్యాపేట(జనంసాక్షి):
ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదితలక్షాది, మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని త్రివేణి ఫంక్షన్ హాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నియోజకవర్గ స్థాయి దావత్ ఎ ఇఫ్తార్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. సూర్యాపేటలో మత సామరస్యంతో అన్ని పండుగలు జరుపుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫి ఉల్లా, సీఐ వెంకటయ్య, ఎండీ. అంజద్ అలీ, ఏఎంసీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, కౌన్సిలర్లు గునగంటి హేమసతీష్,రాజేష్ రెడ్డి, విజయ్ కుమార్, నాగుల వాసు, పిల్లల భవాని రమేష్, మత పెద్దలు అస్రార్, అబ్దుల్ రహీం, ఫరూక్, జావిద్, అయూబ్ ఖాన్, జాని తదితరులు పాల్గొన్నారు.






# భగత్ సింగ్ ఆశయాలు యువతకు ప్రేరణ కావాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**
దేశం కోసం ప్రాణాలు అర్పించిన విప్లవ వీరుడు భగత్ సింగ్ ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అన్నారు. ఏఐవైఎఫ్ సూర్యాపేట పట్టణ కమిటీ మూడవ మహాసభ బుధవారం ధర్మభిక్షం భవన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన సమాఖ్య పార్టీకి చాలా కీలకమైనదని అన్నారు. విద్యార్థి సంఘంలో చురుగ్గా పాల్గొన్న నాయకులు విద్యార్థి దశ దాటిన తర్వాత యువజన సమాఖ్యలో చేరి యువతకు మార్గదర్శకంగా నిలవాలని అన్నారు. నేటి యువత డ్రగ్స్, మత్తు పదార్థాలు, గంజాయికి బానిసలు అవుతున్నారని అన్నారు. యువతను సన్మార్గంలో నడిపే దిశగా విద్యార్ధి సమాఖ్య పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, చామల అశోక్ కుమార్, హేమలత తదితరులు పాల్గొన్నారు. అనంతరం అఖిల భారత యువజన సమాఖ్య పట్టణ కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కుక్కడం శౌరి, పట్టణ అధ్యక్షులుగా బూర సైదులు, ప్రధాన కార్యదర్శిగా ఎడెల్లి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా నిమ్మల శేఖర్, అయితగాని కామేష్, ఆలగడప గోపి, కౌన్సిల్ సభ్యులు గా నిమ్మకంటి నాగరాజు, నిమ్మకంటి సతీష్, చిట్యాల గోపి, కప్పల రామును ఎన్నుకున్నారు.

## తెలుగు ప్రజలందరికీ తెలుగు నూతన సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

## ఏడుదొడ్ల శ్వేత రవీందర్ రెడ్డి



**నాంపల్లి, మార్చి 18 (జనంసాక్షి)**
నేడు తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా నాంపల్లి మండల మాజీ ఎంపిపి ఏడుదొడ్ల శ్వేత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి పులకించి, చిగురించిన కొత్త ఆశలతో అడుగుపెడుతున్న,చైత్ర శుద్ధ పాడ్యమి రోజున బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించాడని మన పురాణాలు చెబుతున్నాయి. వసంత కాలపు రాకతో మామిడి చిగుళ్లు, కోయిలమ్మ పాటలు, వేపపూత పరిమళాలతో ప్రకృతి కొత్త పెళ్లికూతురిలా మెరిసిపోతుంటే,తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు అనే ఆరు రుచుల సమ్మేళనమైన పచ్చడి మన జీవితానికి ఒక గొప్ప సందేశాన్నిస్తుంది. జీవితంలో వచ్చే సుఖదుఃఖాలను, కష్టనష్టాలను, ఉత్సాహాలను సమానంగా స్వీకరించాలని తెలియజేసే ఉగాది పండుగ సందర్భంగా ఈ కొత్త ఏడాది మీ జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, మీరు చేపట్టిన ప్రతి కార్యం దిగ్విజయంగా పూర్తి కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటు,మన సంప్రదాయాలను గౌరవిస్తూ, పంచాంగ శ్రవణం ద్వారా భవిష్యత్తు ప్రణాళికలు వేసుకుంటూ సంతోషంగా ఉండాలి అని కోరుకుంటూ తెలుగు ప్రజలందరికీ శ్రీ విశ్వవసునామ తెలుగు నూతన సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

# అరకొరగా రంజాన్ గిఫ్ట్ ప్యాక్ మంజూరు సరికాదు

# కేటాయింపుల్లో .. పేదలకు అన్యాయం

## మైనార్టీ సంఘం మునుగోడు కోఆర్డినేటర్ మొహమ్మద్ అబ్దుల్ రజాక్



**మర్రిగూడ, మార్చ్18 (జనంసాక్షి):**
రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం నిరుపేద ముస్లింలకు అందించే రంజాన్ గిఫ్ట్ ప్యాక్ లను రాష్ట్ర ప్రభుత్వం అరకొరగా మంజూరు చేసిందని మైనార్టీ సంఘం మునుగోడు కోఆర్డినేటర్ మహమ్మద్ అబ్దుల్ రజాక్ బుధవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మునుగోడు నియోజకవర్గం లో దాదాపు 30,000 మంది ముస్లిం జనాభా ఉండగా, గత ప్రభుత్వం దానికి తగ్గట్టుగా కేటాయింపులు చేసిందని మర్రిగూడ మండలంలో గతంలో 200 రంజాన్ గిఫ్ట్ ప్యాక్ లు పంపిణీ చేయగా, ఈ సంవత్సరం 120 ప్యాకులకు పరిమితం చేయడం పట్ల పేద ముస్లింలు ప్రభుత్వంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం పేద ముస్లింలందరికీ చేరాలే తప్ప, ఇలాంటి పక్షపాత చర్యల వల్ల ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడే ప్రమాదం ఉందని ఆయన హితవు పలికారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రంజాన్ గిఫ్ట్ ప్యాక్ లను పెంచి ప్రతి నిరుపేద ముస్లింకు అందించే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు.

## జూన్ 2న మద్యం దుకాణాలు మూసివేయాలి



హైదరాబాద్ (జనంసాక్షి) : భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన రోజు ఆగస్టు 15, రాజ్యాంగం అమలు పరిచిన రోజు జనవరి 26న మద్యం దుకాణాలు ఎలా మూసివేస్తామో, అలానే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం రోజు జూన్ 2న మద్యం దుకాణాలు మూసివేయాలని స్పై ఫౌండేషన్ ప్రెసిడెంట్ పై సంజీవ కుమార్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ కోసం ఎందరో ప్రాణాలను త్యాగం చేశారని, అలాంటి త్యాగాలతో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన మద్యం దుకాణాలు మూసివేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రస్తుతం జరుగుతున అసెంబ్లీ సమావేశాలలో చర్చించాలని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావుకు వినతి అందజేశారు.

## పదవ తరగతి ప్రశ్నాపత్రం లీక్

### కారకులైన నలుగురి ఉపాధ్యాయుల సస్పెన్షన్

ఆర్మూర్, మార్చి 18(జనంసాక్షి): విద్యార్థులను పరీక్షల్లో గట్టెక్కించి పాస్ చేయించాలన్న ఆత్రుత కాస్త ప్రభుత్వ ఉపాధ్యాయుల సస్పెండ్ కు దారితీసింది. వివరాల్లోకి వెళ్తే.. ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆలూరు మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి ఉర్దూ మీడియానికి సంబంధించిన విద్యార్థులకు తెలుగులో చదువు కాస్త అంతంత మాత్రంగానే ఉన్నారు. ఈ విషయాన్ని గ్రహించిన ఉపాధ్యాయులు ఉర్దూ మీడియం కి సంబంధించిన తెలుగు ప్రశ్న పత్రాన్ని సిమ్ కార్డు లేని ఫోన్ లో ఫోటో తీసి ఉంచాడు. ఈ ప్రశ్న పత్రాన్ని సంబంధిత ఉపాధ్యాయుడు ఫోటో తీసి వాట్సాప్ గ్రూపులో ఇతర పాఠశాల ఉపాధ్యాయుల ఫార్వర్డ్ చేశారు. ఉపాధ్యాయులకు ఫార్వర్డ్ చేరడమే కాకుండా ఇతర వాట్సాప్ గ్రూప్ లోకి ప్రశ్నాపత్రం చేరింది. ఇది కాస్త పూర్తిగా వైరల్ కావడంతో సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నాపత్రం లీకేజీ బయటకు పొక్కింది. దీని కారణంగా పేపర్ లీకేజీ విషయం ఉన్నతాధికారులకు చేరింది. బార్ కోడ్ ఆధారంగా ప్రశ్న పత్రాన్ని గుర్తించిన ఉన్నతాధికారులు ఆలూర్ మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించినదిగా గుర్తించారు. దీంతో ఇందుకు కారకులైన




నలుగురు ఉపాధ్యాయులను పాఠశాల చీఫ్ ఎగ్జామినర్ రాజేందర్, ఎస్జీటీలు సాగర్, ఉమేందర్, విజయ్ లను సస్పెండ్ చేశారు. చదువులు చక్కగా నేర్పించి విద్యార్థులకు బంగారు భవిష్యత్తుకు బాటలు వెయ్యాల్సే తప్పు విద్యార్థులను తప్పటడుగులేసేలా ఇవేం పనులని పలువురు అంటున్నారు. మండల కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులను ప్రభుత్వ, ప్రైవేటు టీచర్లే మాస్ కాపీయింగ్ పాస్ చేయించేందుకు ప్రోత్సహిస్తున్నారని తెలిసింది. ఈ విషయంపై కూడా ఉన్నతాధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## కొత్తపల్లి కృష్ణారావుకి సత్కారం



ఖమ్మం( జనంసాక్షి) : శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది వేడుకల్లో భాగంగా బుధవారం నెల్లూరు జిల్లా, సర్వేపల్లి మండలం వెంకటాచలం లో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నిర్వహించిన జాతీయ స్థాయిలో నిర్వహించిన శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది కవి సమ్మేళనం లో కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఫార్మసీ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న కవి రచయిత మిమిక్రీ కళా కారుడు అయిన కొత్తపల్లి కృష్ణారావు కు "శాంతి సౌరభం" అన్న కవితకు సత్కారం అందుకున్నారు. ఈ కవి సమ్మేళనంలో ముఖ్య అతిథిగా హాజరు అయిన సర్వేపల్లి శాసన సభ్యుడు సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి కొత్తపల్లి కృష్ణారావు ను ప్రశంసా పత్రం, పట్టు కండువా తో సత్కరించడం జరిగింది.

## తెలుగు ప్రజలకు ఎంపీ వద్దిరాజు ఉగాది శుభాకాంక్షలు

ఖమ్మం టౌన్(జనంసాక్షి) : ఉగాది పర్వదినం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలుగు ప్రజలందరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు సంవత్సరాల 60 ఏండ్ల కాలచక్రంలో శ్రీపరాభవ 40వదని, తెలుగు ప్రజల ముఖ్యమైన పండుగల్లో ఉగాది (యుగాది) కూడా ఒకటని తన సందేశంలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. "యుగ"అనగా కాలమని,"ఆది"అంటే ఆరంభం అని,కొత్త సంవత్సరం ప్రారంభమని, ఈ పర్వదినాన్ని చైత్రమాసం శుక్ల పాడ్యమి నాడు తెలుగు ప్రజలు ఉగాది (యుగాది)గా పూర్వకాలం నుంచి జరుపుకుంటున్నామని ఎంపీ రవిచంద్ర చెప్పారు. షడ్రుచులతో (ఆరు రుచులు) కూడిన ఉగాది పచ్చడిని



కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సేవిస్తూ కొత్త ఏడాది ఫలాలను తెలిపే పంచాంగ శ్రవణంలో పాల్గొంటూ ఆనందోత్సాహాల మధ్య పండుగను ఘనంగా జరుపుకుందా మన్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కుటుంబాలలో ఆర్థిక, ఆరోగ్య, సంతోషాలు నింపాలని ఎంపీ రవిచంద్ర ఆకాంక్షించారు. ఈ పర్వదినం సందర్భంగా ఇరు రాష్ట్రాల వాసులు, దేశం నలుమూలల, విదేశాలలో నివసిస్తున్న,స్థిరపడిన తెలుగు ప్రజలందరికి ఎంపీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## మహిళలు అద్భుతంగా రాణిస్తూ జిల్లాను ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారు

### ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి • అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్

ఖమ్మం టౌన్ (జనంసాక్షి) : గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అనేక విభాగాలు, రంగాలలో మహిళలు రాణిస్తూ ఖమ్మం జిల్లాను ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ కొంత ఆలస్యం జరిగినప్పటికీ పండుగ వాతావరణంలో నేడు మహిళా దినోత్సవ వేడుకలు జరుపు కోవడం సంతోషంగా ఉందని అన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అనేక విభాగాలలో మహిళలు బాగా రాణిస్తూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తూ అనేక అంశాలలో ఖమ్మం జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచుతున్నారని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, షీ టీమ్స్, భరోసా, ఇందిరా మహిళా శక్తి వంటి అనేక కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు అవుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్య, వైద్యం అన్ని రంగాలలో ఖమ్మం జిల్లా ముందుండేలా ఉద్యోగినులు, సిబ్బంది పని చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి వేల్పుల విజేత మాట్లాడుతూ ఖమ్మం జిల్లా పరిపాలనలో



మహిళా ఉద్యోగినులు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మహిళా శిశు సంక్షేమ శాఖలో అనేక నూతన కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు. మంచి పనితీరుతో విధులు నిర్వహిస్తున్న మహిళ సిబ్బందికి నేడు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సత్కారం అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు భద్రత కల్పించే విధంగా సఖి కేంద్రం పనిచేస్తుందని అన్నారు. అనంతరం డి.ఆర్.ఓ. పద్మశ్రీ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ భారతి రాణి, వివిధ రంగాలలో సేవలు అందించిన మహిళలను జిల్లా కలెక్టర్ సన్మానించారు. ఈ సమావేశంలో మహిళా ఉద్యోగినులు, జిల్లా అధికారులు, సిడిపిఓ., డి.హెచ్.ఈ. డబ్ల్యూ సఖీమ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా ఇఫ్తార్ విందు

### నియోజకవర్గవ్యాప్తంగా హాజరైన ముస్లిం మైనార్టీలు

హాలియా (జనంసాక్షి) : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నాగార్జున సాగర్ నియోజకవర్గ ముస్లిం మైనారిటీలకు బుధవారం సాయంత్రం హాలియా లక్ష్మీనరసింహ గార్డెన్స్ లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇఫ్తార్ విందును



ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రాజ్ కుమార్ మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ పర్వదినాన్ని జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు ముస్లిం మైనారిటీలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రరావు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుందూరు వెంకట్ రెడ్డి డిప్యూటీ తహసీల్దార్ రఘు వైస్ చైర్మన్ రాజా రమేష్ కాకునూరి నారాయణ, ఆర్ ఐ నవీన్ కౌన్సిలర్లు చెరుపల్లి ముత్యాలు, నకిరేకంటి అన్నపూర్ణ సైదులు, గౌహర్ జబీన్ మజాహర్, మర్ల చంద్రారెడ్డి అన్వర్, బాబుద్దీన్, నసీరుద్దీన్, షర్ఫుద్దీన్ పలువురు ముస్లిం మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.